అమ్మా మీకిది న్యాయమా!

ఆకాశహర్మ్యాలు నాగరికతకు నిదర్శనాలుగా తలెత్తి చూస్తుంటే, చీమల బారుల్లా సాగిపోయే వాహనాలతో నిండిన రోడ్లు "దేశపురోభివృద్ధికి మేమే బాటలం" అంటున్నాయి. దీని కంతటికి కారణం పాదరసంలా ఒక చోట నిలవకుండా పరుగెత్తే మానవమేధ.

నేనెక్కవలసిన బస్సు నాముందు ఆగేసరికి నా ఆలోచనలుకూడా ఆగిపోయాయి నా ప్రక్కనే గాజులు గలగలమనడంతో, ఎక్కబోయే వాడినల్లా ఆగిపోయాను లేడీస్ ఫస్ట్ అన్న జాతీయ నినాదం గుర్తుకొచ్చి. ఆమె నావైపు ఓ చిరునవ్వు విసిరి బస్సెక్కింది.

నా ఒళ్ళు జల్లుమంది. ఆమె అందానికి, ఆమె విసరిన వాడైన ఆ వేడి చిరునవ్వుకు నేను ఆ షాక్‌నుంచి తేరుకోకముందే, నా వెనక వాళ్ళంతా ఎక్కడం, బస్సు స్టార్టు కావడం జరిగిపోయింది. అంతే ఒక అంగలో ముందుకురికి బస్సు కడ్డీ అందుకున్నాను.

మా పట్టంణలో ఎన్ని బస్సులున్నా ప్రయాణీకుల రద్దీ తగ్గదు. రాజధాని తరువాత వ్యాపారంలోగాని,నాగరికతలోగాని, జనాభాలోగాని మా పట్టణమే రాష్ట్రంలో రెండవస్థానం ఆక్రమిస్తుంది. అయితే బస్సు ప్రమాదాల్లో మాది మొదటి స్థానమని పత్రికలు పదేపదే చెబుతుంటాయి.

రెండు, మూడు స్టేజీలు దాటేసరికి నేను ఫుట్‌బోర్డు స్థాయినుంచి బస్సు మధ్యలో హేంగర్స్ పట్టుకొని వేలాడే వాళ్ళలో ఒకడినయ్యాను. సభ్యతకాదని తెలిసినా నా గుండెలో అలజడి కలిగించిన సుందరాంగి కోసం బస్సంతా కలయజూసాను. ఆమె ఎక్కడా లేదు. నా ప్రక్కనున్న సీట్లో కిటికీ దగ్గరగా కూర్చొని ఉంది. ఆమె ప్రక్కనే ఒక సీటు ఖాళీగాఉంది. పక్కన ఖాళీఉంటే ఆడదాన్ని ఆహ్వానించే సాహసం మగాడికి లేదు. అలాగే పరాయి మగాడి ప్రక్కన కూర్చొనే ధైర్యమూఆడదానికి లేదు ఇది అనాదిగా వస్తున్న సాంఘిక కట్టుబాటు.

నా మనసులోని భావం గ్రహించిందన్నట్టుగా, "కూర్చోండి" అంటూనన్ను ఆహ్వానించింది తను కొద్దిగా సర్దుకొని.

నా అంచనాలు తల్లకిందులయ్యాయి. ఆమె సంస్కార హృదయానికి జోహారు లర్పించకుండా ఉండలేకపోయాను. వెళ్ళి ఆమె పక్కన కూర్చున్నాను హేంగర్స్ పట్టుకొని వేలాడుతున్న మగవాళ్ళంతా నావైపు ఈర్ష్యగాను, ఆమెవైపు కసిగాను చూశారు. తమకు రావలసిన దేదో పోగొట్టుకొన్నట్టు.

ఆమె రిజర్వ్డుగా ఉంది. నాతో ఏం మాట్లాడలేదు. ఆమె అందమైన గుండ్రని ముఖం, బంగారు శరీరచ్ఛాయ, సంస్కారం ఉట్టిపడే ముఖం, కట్టుబొట్టు తీరు, అలంకరించుకున్న విధానం బాగా చదువుకొన్న యువతిలా ఉంది.

డ్రైవరు బస్సు నెమ్మదిచేసి, ఆదేవనిగా హారను కొట్టడంతో, కిటికీలోంచి కనిపించినంతమేరకు ఆ దృశ్యాన్ని చూశాను. అదొక ఊరేగింపు. అంతా ఆడ వాళ్ళే. కాలేజి అమ్మాయిల్నుంచి, ఉద్యోగం చేసే ఆడవాళ్ళు, గృహిణులు ఉన్నారు. అందరి చేతుల్లోనూ రకరకాల వ్యాఖ్యాలు వ్రాసి ఉన్న అట్టలున్నాయి.

"అసభ్య సినిమాలు బహిష్కరించాలి."

"స్త్రీల హక్కులు పరిరక్షించాలి."

"రోడ్డు రోమియోలను అరెస్టు చేయాలి."

"ఉద్యోగాలలో స్త్రీలకు రిజర్వేషన్లు ఇవ్వాలి"

ఒకరు అరుస్తూ ఉంటే మిగతావాళ్ళు నినాదాలిస్తున్నారు.

నాకు చాలా సంతోషమనిపించింది. స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ అభ్యు దయం కోరేవాళ్ళలో మొదటివాణ్ణి నేను జాతి జీవనాన్ని పునరుజ్జీవింపజేసిది బిడ్డను ఒక ప్రయోజకుడిగా, వ్యక్తిత్వం కలవాడిగా తీర్చిదిద్దేది స్త్రీ. తల్లిగా, భార్యగా స్త్రీ అతి క్లిష్టమైన పాత్రలో జీవిస్తూ ఉంది. తెర వెనుకనుండి తమ తెలివితేట లతో భర్తల్ని చక్రవర్తుల్ని చేసింది స్త్రీలే! రాజ్యాధినేతలుగా, కవయిత్రులుగా, సంఘ సంస్కర్తలుగా పురుషులతో సమానంగా స్త్రీలు రాణించారు. దీనికి చరిత్రలో ఎన్నో ఆధారాలున్నాయి. నవీన యుగంలోకూడా స్త్రీలు అదే వైభవం కలిగిఉన్నారు అయితే ఈనాడు నాగరికత పెరిగింది. కనుక తమకు మిగిలిపోయిన హక్కుల్ని బాహాటంగా చాటుకొంటున్నారు.

ఊరేగింపు మెల్లగా బస్సును దాటిపోయింది. ఆమేదైనా మాట్లాడుతుందే మోనని చూశాను. మౌనంగా ఉంది, పెదాలమీద చెదరని చిరునవ్వుతో. ఆమెతో ఏదైనా మాట్లాడాలని ఉంది. కాని ఆమె మాట్లాడితే గదా!

బాంకులో జాబ్ చేస్తున్నాను. బ్రహ్మచారిని. ఎవరైనా మనసెరిగిన వాళ్ళని వివాహం చేసుకోవాలని నా ఉద్దేశం. ఇంతగా నచ్చిన అమ్మాయి. నా మనసును ఆకర్షించిన యువతి ఉద్యోగంలో చేరిన ఈ రెండేళ్ళల్లో నా దృష్టిలో పడ లేదు. చూడగానే ఒక మనిషిని గురించి ఒక నిర్ణయానికి రావడం మంచిదికాదని తెలిసినా ఈ అమ్మాయి అంటే నాకో విధమైన గౌరవం, ఆరాధనాభావం స్థిరపడి పోయింది.

ఇంతలో నేను దిగవలసిన స్టాపు వచ్చేసింది.

"థాంక్సండీ" అన్నాను ఇంత పెద్ద నగరంలో ఈ అమ్మాయిని మరలా చూడగలనా అనుకొంటూ.

"నో మెన్షన్, ప్లీజ్!" అంది చిరునవ్వుతో. నేను బస్సు దిగి నగరంలో గొప్పదైన షాపింగ్ సెంటరులో నిలబడ్డాను. ఆ సెంటర్‌లో నేను ఎప్పుడూకానే ఆ టెక్ స్టైయిల్ షాపులో ప్రవేశించాను. విశాలమైన బట్టలంగడది. సీలింగు లోపల ఇమిడిపోయిన ట్యూబ్‌లైట్లు తెల్లని వెన్నెలలు కురిపిస్తున్నాయి. రకరకా లయిన మిల్లులకు సంబంధించిన వస్త్రాలు షెల్ఫుల్లో అమర్చిఉన్నాయి. ఒక్కో షెల్ఫుదగ్గర ఒక్కో సేల్స్‌మాన్ ఉన్నాడు. ఆడవాళ్ళకు సంబంధించిన చీరెలు, బ్లౌజులుఒ వైపు ఉన్నాయి.

నాకు కావలసిన రకాల్లో రెండు పాంటు పీసులు, రెండు షర్టు పీసులు కట్ చేయించి కాష్ కౌంటర్‌వైపు నడిచాను. అంత రద్దీగల షాపులోనూ ఒకే ఒక కాష్ కౌంటరు ఉంది. కాషియర్ కెదురుగా నిలబడ్డ స్త్రీమూర్తిని చూసి చకితుణ్ణ య్యాను. ఆమె బస్సులో కనిపించిన స్త్రీ. కలసిరావడమంటే ఆదేనేమో మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్" అన్నారు. బ్రహ్మదేవుడు గీత గీస్తే తప్పుతుందా? ఎలాగయినా పరిచయం చేసుకొని పెళ్ళిదాకా తీసుకురావాలి. "కృషితో నాస్తి దుర్భిక్షం" అన్నారు పెద్దలు.

"ఇంకో ఎనిమిది రూపాయలివ్వండి. మీ బిల్లు నాలుగు వందల ఎనిమిది" అన్నాడు క్యాషియర్.

"ఇంకా ఎనిమిదేమిటండి! నాలుగు వందలు సర్దుకోండి" అందామె.

"అమ్మా! మేమిక్కడ గుమాస్తాలం. ఓనర్లంకాదు. బిల్లు ఎంత ఉంటే అంత తీసుకోవడం మా బాధ్యత."

"అవునయ్యా! మేరే చెప్పండి ఓనర్లకు."

C. P. BROWN
MEMORIAL LIBRARY
Acc. No
Date

నాకొంచెం కొద్దిగా విసుగలిపించింది. అది నగరంలోనే పేరు ప్రఖ్యాతులున్న వస్త్రాలయం. అక్కడన్నీ ఫిక్సెడ్ రేట్సే. మిగతా షాపుల్లో పోల్చిచూస్తే ఇక్కడే చౌక అనుకోవాలి. ఇన్ని తెలిసి ఆమె ఇలా ఎందుకు మాట్లాడుతుందో నాకర్థం కావడంలేదు. ఏది ఏమయినా ఈ జాగ్రత్త ముందే ఉండాలి.

"ఇక మీ ఇష్టం అండి నేను చెప్పాల్సింది చెప్పాను" అంటూ ఇంకో బిల్లు అందుకొని కాష్ తీసుకొంటున్నాడు.

'పాపం! డబ్బుల్లేవేమో, సహాయం చేద్దాం' అనుకొన్నాను.

ఇంతలోనే ఆమె నసుగుతూ భుజానికి వేలాడుతున్న మినీబాగ్‌లోంచి విసురుగా ఓ పది రూపాయల నోటుతీసి అతని కందించింది.

అతను క్యాష్ బాక్సులోంచి రెండు రూపాయలనోటు తీసి ఆమె కందించాడు. పాకెట్‌ను ఆమెపైపు నెట్టి మరో బిల్లు అందుకొని డబ్బు లెక్కపెట్టుకొంటున్నాడు.

ఆమె అక్కణ్ణుంచి కదల్లేదు.

"ఏమిటి రెండు రూపాయలు ఇచ్చారు?"

నా దగ్గర డబ్బు అందుకొని లెక్కపెడుతున్న కాషియర్ "మీకు రావలసింది అంతే కదా" అన్నాడు.

నా పని పూర్తయినా అక్కడే నిలబడ్డాను. ఆమెతో కొంత దీర్ఘంగా చర్చించాల్సిన పనిఉంది కనుక.

"నేనిచ్చింది వంద రూపాయలనోటు. నాకు తిరిగి రావల్సింది తొంబై రెండు కదండీ!" కొద్దిగా కోపంతో అంది.

"బాగా గుర్తుతెచ్చుకోండి." వరుసగా వచ్చే కస్టమర్స్ దగ్గర డబ్బు తీసుకొంటూ యాథాలాపంగా అన్నాడు కాషియర్. అటువంటి అనుభవాలు అప్పుడప్పుడూ జరుగుతూ ఉంటాయి. తరువాత వాళ్ళు తమ దగ్గరున్న మిగిలిన డబ్బు లెక్కపెట్టుకోవడమో, లేక ఇచ్చినది గుర్తు తెచ్చుకొనో సర్దుకొని పోతుంటారు.

"గుర్తు తెచ్చుకోవడమేమిటయ్యా! నేనిచ్చింది వందరూపాయల నోటే. మీరేబాగా గుర్తు తెచ్చుకోండి." అంది స్థిరంగా.

ఈసారి స్టన్ అయ్యాడు కాషియర్. "అమ్మా దేవుని సాక్షిగా మీరిచ్చింది పది రూపాయలే. నా మాట నమ్మండి."

"అంటే నేను నమ్మకంలేని మనిషినా?" రోషంగా అందామె.

"నేను మిమ్మల్నినడం లేదమ్మా. మీ బాగ్ ఒకసారి చూసుకోండి."

"ఏమిటి నీ ఉద్దేశం? నా బాగ్‌లో డబ్బులు కరెక్టుగానే ఉన్నాయి. నేను ఆడదాన్నని నలుగురిలో నన్నిలా అల్లరి పెడతావా?" ఆమె ఎగిరిపడింది. ముఖం రోషంతో ఎర్రబడింది. వ్యవహారం తీవ్రరూపం దాల్చడంతో అందరూ అక్కడ గుమికూడారు. కొద్దిసేపు తీవ్రంగా వాదించిన కాషియర్ చల్లబడిపోయాడు.

కాషియర్ ముఖం దీనంగా ఉంటే, ఆమె ముఖం కోపంగా ఉంది. అతను లో బి.పి.లో ఉంటే, ఆమె హై బి.పి.లో ఉన్నట్లుంది. అందరూ కాషియర్‌ను మందలిస్తున్నారు. ఆమెపై జాలి చూపిస్తున్నారు.

నేను కళ్ళారా చూశాను. ఆమె ఇచ్చింది ఖచ్చితంగా పదిరూపాయలనోటే. కాని కాషియర్‌పైపు మాట్లాడటానికి నాకు ధైర్యం చాల్లేదు. ఎందుకంటే అక్కడున్న వాళ్ళంతా ఆమెనే సమర్థిస్తున్నారు. అంతసేపు మాట్లాడిన కొట్టు వర్కర్లుకూడా ఆమె వాదన చూసి "ఆమె ఇచ్చింది నిజమేనేమో, మన కాషియర్ సరిగా చూసుకోలేదేమో" అనే నిర్ణయానికి వచ్చి నిశ్శబ్దమైపోయారు. కాషియర్ తప్పనిసరై తొంభై రూపాయలు చెల్లించాడామెకు.

నేను ఒక నిజాన్ని దాచినందుకు సిగ్గుపడ్డాను. నాకేదో ఓ మూలనుంచి ఆమెమీద మంచి అభిప్రాయముంది. కొట్టు దాటింతర్వాత నెమ్మదిగా ఆమెతో మాట్లాడి, ఉన్న విషయం చెప్పి, ఆ డబ్బు మళ్లీ కాషియర్‌కు ఇప్పించగలననే ధైర్యముంది. పొరపాటు అనేది ప్రతిఒక్కరికీ సహజం. సంస్కారం గల స్త్రీ కనుక వెంటనే తప్పు ఒప్పుకొంటుంది.

"సార్! మీలో ఎవరో చూసుంటారు. సార్! నిజం చెప్పండి సార్.... మా ఓనర్ జీతంలో ఆ డబ్బు కోసేస్తాడు, సార్.........పిల్లలు కలవాణ్ణిసార్...." అతను అందరిపైపూ చూస్తూ ప్రాధేయపడుతున్నాడు. ఆ చూపు నామీద పడకముందే మెట్లుదిగాను.

ఆమె ముందు నడుస్తూఉంది. ఆమెను చేరుకోవాలి. యదార్థాన్ని చెప్పి ఆమె పశ్చాత్తాపపడేటట్లు చేయాలి. ఇంకో పదడుగుల్లో ఆమెను చేరుకుని ఉండేవాణ్ణి.

"ఏరోయ్. విశ్వం. ఇప్పుడే మన ఊర్నించి వస్తున్నాను" అంటూ రాజారావు అడ్డుపడ్డాడు.

రాజారావు మా ఊరివాడు. నేనే వాడు ఊరికి పోతానంటే ఇంటి దగ్గర విషయాలు కనుక్కొని రమ్మన్నాను. నేను ఈ మధ్య వచ్చేప్పుడు మా అమ్మ ఆరోగ్యం సరిగాలేదు. వెళ్ళివద్దామనుకుంటే సెలవు దొరకలేదు.

బస్సు స్టాపువైపు వెళుతున్న ఆమెను కనుకొనల్లోంచి గమనిస్తూనే రాజారావు చెప్పేది వింటున్నాను. మా అమ్మ ఆరోగ్యం బాగానే ఉందని, రెండు రోజుల్లో మా నాన్న రాబోతున్నాడని చెప్పి సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు రాజారావు. నేను వడివడిగా బస్సు స్టాపువైపు నడిచాను.

బస్సు దూరంనుంచి వస్తూఉంది. బస్సురాగానే ఆమె హడవిడిగా ఎక్కింది నేనూ అందుకోగలిగాను. ఇంతకుముందు వచ్చినప్పటికంటే ఇప్పుడు బస్సు రద్దీ ఎక్కువగా ఉంది. ఆమె నా తర్వాత నలుగు రయిదుగురి ముందు ఉంది. ఒక చేత్తో బట్టల పాకెట్ గుండె కదుముకుని, రెండవ చేత్తో హేంగరు వట్టుకొని నిలబడి ఉంది. పెదాలపై ఆ చెరగని చిరునవ్వు గుండెని స్పర్శిస్తూఉంటే, ఇంతవరకూ ఆమెతో మాట్లాడలేకపోయినందుకు బాధగాఉంది. ఆమె ఇంతకుముందు ఎక్కినచోటే దిగితే బాగుణ్ణు. ఆమె పేరు, ఊరు అడిగి నా ప్రేమ విషయం చెప్పెయ్యొచ్చు అనుకున్నాను. ఆమెను భార్యగా పొందడంకంటె ఆనందం వేరొకటుందని నేననుకోవడంలేదు.

కండక్టరు టికెట్లు కొడుతూ వస్తున్నాడు. ఆ అమ్మాయి చుట్టూ ఉన్నవాళ్ళు ఆమె అందాన్ని త్రాగేసేట్టు చూస్తున్నారు. ఆమెను ఎక్కడికి పోవాలని అడిగాడు కండక్టరు. ఆమె తను దిగవలసిన స్టేజి చెప్పింది. అది ఇంతకు ముందు తను ఎక్కిన స్టేజి. టికెట్ అందుకొని, బస్సు స్పీడ్‌కు తట్టుకొంటూ సునాయాసంగా బాగ్ తెరచి రెండు రూపాయలనోటు అందించింది. ఆమె అందాన్ని ఆరాధిస్తూ ఆమె చర్యలను అప్యాయంగా పరిశీలిస్తున్నాను. ఎప్పుడెప్పుడు స్టేజి వస్తుందా, ఆమెతో మాట్లాడుదామా అని ఉవ్విళ్ళూరుతున్నాను

"ఏమిటండి, రూపాయ అరవై పైసలిచ్చారు. నేనిచ్చింది ఇరవై రూపాయల నోటుకదా?" అమాయకంగా, ఆదుర్దాగా అడిగిందామె.

నా కాళ్ళక్రింద ప్రదేశం జరజరా ఎక్కడికో కదలిపోతున్నట్టు, నేను ఉన్నచోటనే కూలిపోయినట్టు అనుభూతి కలిగింది. రెండు రూపాయల నోటిస్తూంటే నా ఈ కళ్ళతో చూశాను. అయితే ఆమె క్లెయిమ్ చేసేది ఇరవై రుపాయల నోటని. ఇది పచ్చిమోసం! దగా! ఇంతకుముందు జరిగింది పొరపాటని భావించిన నేను ఈ సంఘటనతో ఆమె కావాలనే మోసం చేస్తుందని అర్థంచేసుకున్నాను.

కండక్టరు ఆమె ప్రశ్నలకు జవాబివ్వలేదు. నిర్లక్ష్యంగా తల ఎగురవేసి మిగతా వాళ్ళకు టిక్కెట్లు కొడుతున్నాడు.

"చూడండి. ఆడవాళ్ళం గదాని జవాబు చెప్పకుండా పెడుతున్నాడు. నాకు రావలసిన డబ్బు లిప్పించండి." ప్రక్కనున్న యాభై సంవత్సరాలాయనకు ఫిర్యాదు చేసింది.

"ఏమయ్యోయ్, ఏంది సంగతి? ఆమెకివ్వాల్సిన డబ్బులిచ్చి వెళ్ళు" అరిచాడాయన!.

"ఆమె ఇచ్చింది రెండు రూపాయలే!'' విసుగ్గా అని, తిరిగి తన పనిలో మునిగిపోయాడు కండక్టర్.

''కాదండీ, ప్లీజ్! మీరు న్యాయం చెప్పండి. నేనిచ్చింది ఇరవై రూపాయల నోటేనండి." ఆమె చుట్టుపక్కల వాళ్ళని ప్రాధేయపడుతూ అడిగింది. నిలబడి ఉన్నవాళ్ళంతా మగవాళ్ళ.

అందరూ కండక్టరును తిట్టసాగారు.

"ఇచ్చేయ్యవయ్యా ఆమె డబ్బులు" అని కొందరంటే.

"సిటీ బస్సుల్లో ఇంతేనండి! కాగితం ఇచ్చేప్పుడు ఎటో చూస్తుంటారు. చిల్లర సరిగా ఇవ్వరు" అని మరి కొందరంటున్నారు.

ఇంకొందరు "అసలు దొంగలు కండక్టర్లే నండీ" అంటున్నారు.

లేడీస్ సీట్లలో కూర్చుని ఉన్న ఆడవాళ్ళయితే మరీను "పాపం, ఏం చేస్తుంది పిచ్చిపిల్ల" అని "చాలా అమాయకురా"లని అనుకొంటున్నారు

ఇంతలో ఓ స్టూడెంట్ ముందుకువచ్చి అన్నాడు. "ఈమె ఇచ్చింది ఇరవై రూపాయల నోటు. నేను కళ్ళారాచూశాను." అప్పటి వరకూ అతను ఏ సాహసం చేసి ఆమెముందు హీరోలా నిలబడాలా అని ఆలోచిస్తున్నాడు.

"ఏమిటి నువ్వు చూసింది? ఆమె రెండు రూపాయల నోటిస్తే ఇరవై అంటావు బస్సులో ఇంతమంది ఉన్నా ఎవరు ఎంతిచ్చింది మాకు గుర్తుంటుంది" మండిపడ్డాడు కండక్టర్. అతనికి ఇటువంటి వాళ్ళంటే లెక్కలేదు. కాని బస్సులోని వాళ్ళంతా ఆ స్టూడెంట్‌నే సపోర్టు చేశారు. కండక్టరు మెత్తబడక తప్పలేదు..

నేను ఇదే సమయమని ముందుకొచ్చాను "అయ్యా! అందరూ వినండి. ఈమె ఇచ్చింది అక్షరాల రెండు రూపాయలు. నేను బాగా చూశాను" అన్నాను. ఇంతకు ముందొక నిజాన్ని దాచినందుకు సిగ్గుపడుతూ.

అందరూ నావైపు ఆశ్చర్యంగా చూశారు. మళ్ళీమళ్ళీ అదే చెప్పాను. కండక్టర్ నావైపు ప్రశంసాపూర్వకంగా చూశాడు.

ఆమె ఏమాత్రమూ అధైర్యం చెందలేదు. "ఇతనెవరోనండి, రోడ్డురోమియో లాగున్నాడు. మధ్యాహ్నంనుంచి నన్ను వెంబడిస్తున్నాడు. నేను ఎక్కడికి పోతే అక్కడ ప్రత్యక్షం. అతన్ని తప్పించుకోవడం చచ్చినంత పనిగాఉంది" అంది నావైపు కోపంగా చూస్తూ.

అంతే. అందరూ ఒక్కసారిగా అరిచారు.

"కొట్టండి గాడిదను."

''నరకండి రాస్కెల్‌ను''

"ఆడపిల్లను అవమానిస్తావురా?"

ఫట్ ఫట్ మంటూ అందరూ తలా ఒకదెబ్బ కొట్టారు. కాని ఆ దెబ్బలు నాకు తగలకుండా కండక్టర్ అడ్డుపడి తను తిన్నాడు. ఇక నేను ఉండబట్టలేక క్లాత్‌స్టోరులో జరిగిన విషయం చెప్పి, ఆమెను పోలీసులకు పట్టిస్తాం అన్నాను.

''అబద్ధం, సార్! అతని మాటలు నమ్మకండి. మేము ఎంతో విలువగా బ్రతికిన వాళ్ళం. పరువుపోయిన తరువాత ఇక బ్రతకడం దేనికి" అంటూ కన్నీళ్ళు కార్చింది.

"ఏడవకమ్మా! అడ్డగాడిదలు ఏమైనా కూస్తారు''

"రాస్కెల్స్! ప్రొద్దునలేస్తే ఆడపిల్లల వెంటబడడమే వీళ్ళపని''

''ఇటువంటి వాళ్ళని ముందు పోలీసులకు పట్టించాలి."

"తను అబద్ధం చెబుతూనే, ఇంకొకరి మీద తప్పుడు ప్రచారం చేస్తున్నాడు"

అందరూ తలా ఒక విధంగా ఆమెను ఊరడిస్తున్నారు.

నాకు చాలా అసహ్యమేసింది. ఈ మనుషులమీద, వీళ్ళ సంకుచిత మనస్తత్వాలమీద, ఆడవాళ్ళంటే కరిగిపోవడం వీళ్ళ బలహీనత. తమ ప్రత్యేకతను చాటుకోవాలనుకోవడం వీళ్ళ నాగరికత. న్యాయాన్యాయాల గురించి వీళ్ళాలోచించరు

కండక్టర్ ప్రయాణీకుల ఒత్తిడిని తట్టుకోలేక గొణుక్కుంటూ మిగతా చిల్లర ఆమె చేతిలో ఉంచాడు.

కండక్టర్ నా దగ్గర టిక్కెట్టు డబ్బులు తీసుకుంటూ నావైపు జాలిగా చూశాడు. అతనికి జరిగిన ఆర్థిక నష్టంకంటే, నాకు జరిగిన అవమానం ఎక్కువగా భావించి నట్లున్నాడతను.

నా స్టేజి రాగానే బస్సు దిగాను. ఆమెకూడా దిగి, నావైపు అసహ్యంగా చూసింది. రిక్షా రూపాయకు బేరమాడుతూ ఉంది. వాడు రూపాయిన్నర అడుగు తున్నాడు. చివరకు రూపాయకు బేరంతెగి ఆమె రిక్షా ఎక్కింది. రిక్షా ఓ సందున బడి పోసాగింది. సన్నగా ఎండిపోయిన అవిశె చెట్టులా ఉన్న శ్రామికుడు రిక్షా వాలాను చూస్తే జాలేసింది. ఎందుకంటే వాడికి రూపాయ బాడుగ ఇచ్చి, నే నిచ్చింది అయిదు రూపాయలని, నాలుగు రూపాయలు చిల్లర తీసుకొంటుందని· అందుకే రిక్షివాడి దగ్గర అయిదు నోటు ఉండకూడదని దేవుని ప్రార్థించాను.

నా కిప్పు డామె అంటే అసహ్యం.

ఇంతమాత్రంచేత స్త్రీ జాతిమీద గౌరవం తగ్గలేదు.

కారణం, ఇది అన్నంకాదు గదా ఒక మెతుకుపట్టి, అన్నమంతా ఏ స్థితిలో ఉందో తెలుసుకోవడానికి.

ఇది సమాజం. విభిన్న మనస్తత్వాలు, రకరకాల వేష భాషలు, పలు మతాలు, వివిధ రకాల నాగరికతలతో కలగాపులగంగా తయారైన విచిత్ర వ్యక్తుల సమూహం.

"మేం ఆడవాళ్ళం. మాకు సమాన హక్కులు కావాలి" అన్నంత మాత్రాన సరిపోదు. ఆడవాళ్ళకు గాని, మగవాళ్ళకు గాని నాగరికత, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, భావప్రకటన ఉండాల్సిందే. అయితే ఎంతవరకు? సమాజం వెర్రితలలు వేయనంతవరకు. స్త్రీ వినయ విధేయతలు వీడనంతవరకు.

ఆమె నాకు మరలా తారసపడితే, "అమ్మా, నీ కిది న్యాయమా! తల్లిగా గౌరవాన్ని, భార్యగా ప్రేమను, కూతురుగా అనురాగాన్ని పొందే స్త్రీమూర్తిగా పుట్టి నీ విలాంటి పనిచేయడం తగునా? మొత్తం స్త్రీజాతికే ఇది అవమానం" అని అడగదలచుకొన్నాను.

నా మనసులో ఇప్పు డొకటే మానసిక రొద.

నా అసమర్థత కారణంగా తొంభై రూపాయలు పోగొట్టుకొన్న క్లాత్ స్టోరు కాషియర్‌కి ఆ డబ్బిచ్చి ఆదుకోవాలి. అప్పటివరకూ తృప్తిలేదు.

దగ్గరలో వున్న నా రూమ్‌వైపు అడుగులు పడ్డాయి.